# ఇరాన్‌లో ప్రభుత్వాన్ని కుదిపేసిన ప్రజల నిరసనాందోళనలు




**ప్రజానిరసనలు,** ఆందోళనలతో ఇరాన్ దద్దరిల్లింది. ఈ ఆందోళనలు ఇరాన్‌లోని దాదాపు అన్ని నగరాలు, పట్టణాలకు వ్యాపించాయి. 2017 డిసెంబర్ 8న మొదలైన ఈ ఆందోళనలు ఓ వారం రోజులపాటు కొనసాగాయి. ఇరాన్ ప్రభుత్వం ఈ ఆందోళనలపై ఉక్కుపాదం మోపింది. ఈ ఘర్షణల్లో కొందరు పోలీసులతో సహా దాదాపు 21 మంది మరణించారు. ఈ ఆందోళనల్లో పాల్గొన్న షుమారు 450 మందిని అదుపులోకి తీసుకున్నట్లుగా అధికారులు అంగీకరించారు.

ఈ ప్రజానిరసనాందోళనలు అకస్మాత్తు ఘటనలు కావు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఇరాన్ ప్రజానీకంలో పెరుగుతున్న అశాంతి, ఆగ్రహాలలో ఈ ఆందోళనలూ ఒక భాగమే. దేశ రాజధాని టెహరాన్‌కు నైరుతి దిక్కుగా 300 కి.మీ. దూరంలోనున్న అరక్ అనే ఓ పారిశ్రామిక నగరంలో, 2002లో ప్రైవేటీకరించబడిన రెండు పరిశ్రమలకు చెందిన కార్మికులు 2017 సెప్టెంబర్ చివరలో 2 రోజులపాటు పోలీసులతో ఘర్షణపడ్డారు. ప్రైవేటుపరం చేసిన ఆ రెండు పరిశ్రమల యాజమాన్యాలు కూడా కార్మికుల వేతన బకాయిలను, వైద్యబీమా ప్రీమియమ్‌లను తిరిగి చెల్లించకపోవటంతో ఈ రెండు పరిశ్రమల కార్మికులు ఆందోళనకు పూనుకున్నారు. వారి నిరసనను భగ్నంచేసి, కార్మికులందరిని అక్కడి నుండి తరిమివేయటానికి పోలీసులు ప్రయత్నించినపుడు వారు పోలీసులతో ఘర్షణ పడ్డారు. వందలాది మంది చమురు కార్మికులు, వాహన డ్రైవర్లు–అక్టోబర్ చివరలో ఆలస్యంగా వేతనాలు చెల్లించటాన్ని నిరసించారు. టోబ్రిజ్ ట్రాక్టరు పరిశ్రమ కార్మికులు, ఈ పరిశ్రమ మూసివేతకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. టెహరాన్‌లోని టైర్ల ఫ్యాక్టరీ కార్మికులు తమకు బోనస్ చెల్లించాలని డిమాండ్‌చేస్తూ నిరసనాందోళన సాగించారు.

ప్రస్తుతం సాగుతున్న, విస్తృతంగా వ్యాపించిన ఈ నిరసనాందోళనలు, గతకాలపు ఆందోళనల కొనసాగింపుగా ప్రజలలో పెరుగుతున్న అశాంతి, ఆగ్రహాల వ్యక్తీకరణలే. పెరుగుతున్న నిరుద్యోగం, ఆహార ధరల పెరుగుదల మరియు ప్రభుత్వం చేపట్టిన తీవ్రమైన పొదుపు చర్యలన్నింటితో కార్మికులు, యువజనులు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. శాంతియుతంగా నిరసన తెలిపే కార్మికుల హక్కును పరిగణలోకి తీసుకుంటూ ఇరాన్ అధ్యక్షుడు హసన్ రహౌని “నిరుద్యోగానికి మించిన పెద్ద సమస్య మాకు మరొటిలేదు” అని పేర్కొన్నాడు.

ప్రజల ఆర్ధిక పరిస్థితులు నానాటికీ దిగ జారుతున్న ఫలితమే ప్రజల నిరసనాందోళనలు. అధికార గణాంకాల ప్రకారమే, ఇరాన్‌లో మొత్తం పనిచేయగలిగిన వారిలో 32 లక్షలమంది అనగా 12.7 శాతం నిరుద్యోగులుగా వున్నారు. అయితే యువకులలో ఈ నిరుద్యోగం వాస్తవికంగా 40 శాతం దాకా వుంది. దేశంలోని 50శాతం ప్రజానీకం పేదరికంలో నివశిస్తున్నారని ‘ఇరానియన్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్’ (ఐఆర్‌జిసి) నివేదిక తెలియజేసింది. ‘వరల్డ్ వెల్త్ ఇన్‌కమ్ డేటాబేస్’ యొక్క 2013 సం॥ గణాంకాల ప్రకారం, ఇరాన్‌లో అత్యంత ధనికులైన పై శ్రేణీలోనున్న ఒక శాతం, దాదాపు దేశ జనాభాలో అట్టడుగునున్న 50 శాతం జనాభా ఆదాయంతో సమానమైన రాబడి కలిగి దేశ ఆదాయంలోని 16.8 శాతంపై గుత్తాధిపత్యం కలిగివున్నారు. అలాగే పైశ్రేణిలోనున్న 10 శాతం మంది దేశ ఆదాయంలో 48.5 శాతం పొందుతున్నారు.

దీనికి తోడుగా, 2010 నుండి ప్రభుత్వం పెట్రోలు, వంటగ్యాస్, మౌలిక ఆహారం, అత్యవసర సేవలపై ప్రజలకిచ్చే సబ్సిడీలను, నగదు చెల్లింపుల రూపంలోకి మార్చింది. ప్రస్తుత సంవత్సరంలో అత్యవసర సరుకులపై కూడా సబ్సిడీలను నగదు రూపంలోకి మార్చింది. పెట్రోలు ధర 50శాతం వరకూ పెరిగిపోయింది. ఈ పరిస్థితికి వ్యతిరేకంగా ప్రజాగ్రహం భారీ ప్రజాందోళనలుగా వ్యక్తమైంది.

ఇరాన్ అధ్యక్షుడు రహౌని భారీ ప్రజా ఆందోళనలకు నిరుద్యోగమే కారణంగా వుందని బహిరంగంగానే అంగీకరించినా, అయతుల్లా ఖొమైనీ వంటి కులీన పాలకవర్గం నుండి, ఐఆర్‌జిసి ఉపకమాండర్ జనరల్ రసౌల్ సనాయి, మాజీ దేశాధ్యక్షుడు మహమ్మద్ ఖతామి వరకు, ఇరాన్‌యొక్క ‘వ్యూహాత్మక ప్రత్యర్థులైన’ అమెరికా, ఇజ్రాయెల్, సౌదీఅరేబియాలే సామూహిక హింసకు మద్దతిస్తూ, ఆందోళనలను ప్రేరేపిస్తున్నాయని ఆరోపిస్తున్నారు. వివిధ సందర్భాలలో ఈ ‘ప్రత్యర్థి దేశాలు’ ఇరాన్‌లో ప్రభుత్వ మార్పుకు పిలుపునిచ్చి, ‘ఇరాన్‌లో యుద్ధాన్ని’ కోరుకున్నాయి. ప్రజాందోళనల నేపథ్యంలో ఇరాన్ పాలకవర్గంలోని ముఠాలన్నీ ఒక చోటికి వచ్చినట్లుగా కన్పడుతోంది.

గతంలో అమెరికా సామ్రాజ్యవాదం, పశ్చిమాసియాలోని వారి మిత్రపక్షాలు కలిసి ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టటానికి ప్రయత్నించాయి. 2009లో అమెరికా మరియు ఫ్రాన్స్ సామ్రాజ్యవాదులు, పశ్చిమదేశాల ప్రచారమాధ్యమాల సహకారంతో, ఇరాన్ పాలకవర్గంలోని ఒక విభాగం, అమెరికా సామ్రాజ్యవాదానికి సన్నిహితమైంది. నాటి దేశాధ్యక్షుడైన మహమౌద్ అహ్మెంజాద్‌ను మరో పర్యాయం ఎన్నుకోవటాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలను ప్రేరేపించి ప్రజలను తప్పుదోవ పట్టించింది.

ప్రస్తుత ప్రజాందోళనలు 2009 నాటి ఆందోళనతో మౌలికంగా భిన్నమైనవనేది అంతే నిజం. 2009 నాటి ఆందోళనలు ప్రధానంగా రాజధాని నగరమైన టెహరాన్‌లో కేంద్రీకృతమై, నగరంలో ఉన్నత మధ్యతరగతి వర్గంయొక్క మద్దతును మాత్రమే

చూరగొన్నాయి. కాగా, ప్రస్తుత ఆందోళనలు ఇరాన్ వ్యాపితంగా 15 నగరాలు, పట్టణాలకు వ్యాపించటంతోపాటు, కార్మికులు, యువజనులు, పేద ప్రజానీకం ఈ ఆందోళనల్లో పెద్దసంఖ్యలో పాల్గొంటున్నారు. ప్రస్తుత ప్రజాందోళనల్లో పొదుపు చర్యలను, ధరల పెరుగుదలను, నిరుద్యోగాన్ని వ్యతిరేకిస్తుండగా, 2009 నాటి ఆందోళనల్లో సామాజిక ఖర్చుక్రింద ప్రజలపై ప్రభుత్వం 'అమితంగా వ్యయం చేస్తున్నదని' విమర్శించారు.

అమెరికా సామ్రాజ్యవాదం నిరంతరం విధిస్తూ వచ్చిన ఆర్థిక ఆంక్షలు, సైనిక వత్తిళ్ళు, చమురు ధరల పతనం, అధ్యక్షుడు రహౌనీ అమలుచేసిన ఘోరమైన పొదుపు చర్యలే, ఇరాన్‌లో నెలకొన్న ఆర్థిక సంక్షోభానికి కారణాలుగా వున్నాయి.

నాలుగు దశాబ్దాల క్రితం, 1979లో అమెరికా దన్నుతోనున్న నిరంకుశ షా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెల్లుబికిన ప్రజాఉద్యమం, షాను అధికారంనుండి కూలదోసింది. అయతుల్లా ఖొమైనీ నాయకత్వంలో ఇరాన్ బూర్జువావర్గం అధికారంలోకి వచ్చింది. ప్రజల తిరుగుబాటులో షియా తెగవారు నాయకత్వంలో నున్నారు. కార్మికులకు, శ్రమజీవులకు అనేక రాయితీలు ఇచ్చారు.

ఇరాన్ బూర్జువావర్గం యొక్క ప్రతీఘాతుక స్వభావం, 8 సం॥ల కాలంపాటు సాగిన ఇరాన్ – ఇరాక్ యుద్ధం సందర్భంగా వెల్లడైంది. ఇరాన్‌పై అమెరికా సామ్రాజ్యవాదుల మద్దతుతో ఇరాక్ దాడికి పాల్పడగా, అమెరికా మద్దతుతోనే షా ప్రభుత్వం ఇరాక్‌పై ఫత్తల్ అరబ్ పరిష్కారాన్ని రుద్దింది. అంతర్గతంగా రాజకీయ వ్యతిరేకతను అణచివేయటాన్ని, ప్రజావెల్లువను నీరుగార్చటాన్ని, 'జాతీయ ఐక్యత' పేరిట దానికి లోబరచటాన్ని సమర్థించుకోవటానికి పాలక వర్గానికి యుద్ధం దోహదపడింది. ఇరాన్ కులీన పాలకవర్గం– ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దురాక్రమణను, 2003లో ఇరాక్‌పై అమెరికా దురాక్రమణను సమర్థించింది.

అయినప్పటికీ, అమెరికా సామ్రాజ్య వాదులు ఆర్థిక ఆంక్షలను, సైనిక వత్తిడిని కొనసాగించారు. 2014 ఎన్నికల్లో అయితుల్లా ఖొమైనీ, అమెరికాతో దీర్ఘకాల సన్నిహిత బాంధవ్యాలున్న హషేమీ రఫ్‌సాంజానీల మద్దతుతో రహౌనీ ఇరాన్ అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. గడిచిన మూడున్నర సం॥లుగా ఐఎమ్ఎఫ్ యొక్క మార్కెట్ అనుకూల ఆదేశాలకనుగుణంగా రహౌనీ ప్రభుత్వం ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలను అమలుచేసింది. చమురు దిగ్గజ కంపెనీల ద్రవ్యపెట్టుబడిని ఆకర్షించేందుకు పెట్రోలియం వెలికితీత చట్టాలను సవరించింది. ఐఎంఎఫ్ ఆదేశాలకనుగుణంగా శ్రమజీవులకు సామాజిక సౌకర్యాలలో కోత విధించింది.

ఫలితంగా అమెరికా మరియు యూరోపియన్ యూనియన్ విధించిన ఆంక్షలను 2016లో తాత్కాలికంగా ఎత్తివేశారు. తన పౌర అణ్వాయుధ కార్యక్రమాన్ని రద్దుచేసుకోవటానికి ఇరాన్ అంగీకారం తెలిపింది. ఆంక్షల తొలగింపు, ఇరాన్ ఆర్థికవ్యవస్థకు ఉత్తేజమిచ్చింది. అయితే ఈ లబ్ధినంతటినీ ఉన్నత వర్గాలు అనుభవించగా, పేదవర్గాలన్నీ దానికోసం పణమొడ్డాల్సిన స్థితి వచ్చింది.

సామ్రాజ్యవాద దేశాలు ఇరాన్‌పై విధించిన ఆర్థిక ఆంక్షల భారమంతా ఇరాన్ కార్మికులు, రైతులు, ఇతర శ్రామిక ప్రజానీకంపై పడుతుండగా, ఉన్నత వర్గాలు ఈ కాలంలో మరింత సంపన్ను లయ్యారు. ఇరాన్‌లో ప్రజా నిరసనలు పెరగటానికి ఇదే కారణం.

ఇరాన్ ప్రజలు తమ భవితవ్యాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాలి. దశాబ్దాలుగా పాలక వర్గాలు వారిని మోసగించాయి. ఇదే తరహా ప్రజాందోళనలు మధ్యప్రాచ్యంలోనూ బ్రద్ధలవు తున్నాయి. ప్రజాగ్రహం వృధా పోదు. కార్మికులు, యువజనులు–సామ్రాజ్యవాదానికి, ఇరాన్ పాలక వర్గాలకు వ్యతిరేకంగా సమీకృతులై పోరాటం సాగించాలి.

oooooo